జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 3-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 662 పేజీలు: 4 వెల: రూ.7

# అంతర్రాష్ట్ర దోపిడీ.. ముఠా అరెస్టు

* పోలీసుల అదుపులో ఒడిశాకు చెందిన ఐదుగురు
* 2 పిస్టల్స్, నాలుగు కార్లు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం
* 243 గ్రాముల అభరణాలు రికవరీ
* కొలిక్కి వచ్చిన పలాస బంగారు ఆభరణాల చోరీ కేసు
* దోపిడీ దొంగలపై మొత్తం 32 కేసులు
* వివరాలు వెల్లడించిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

**పలాస/శ్రీకాకుళం క్రైం, మే 2 (వార్త):** పలాసలోని నిత్యానందనగర్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర జువెలరీ షాప్‌లో జరిగిన బంగారు ఆభరణాల దోపిడీ కేసులో అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్నామని, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి సొత్తును రికవరీ చేశామని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి వెల్లడించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిందితులను మీడియా ముందుకు ప్రవేశపెట్టారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఒడిశాకు చెందిన రామంద్ర సాహు, కున బారిక్, బానోజ్ బెహరా పట్నాయక్, తపన్ మహారాణాతో పాటు పలాస మున్సిపాలిటీ చెందిన పొట్నూరు తిరుమల పాత్రోలు ఈ దోపిడీకి పాల్పడ్డారన్నారు. షాపులో దోపిడీ చేసిన 800 గ్రాముల బంగారు ఆభరణాల్లో 243 గ్రాములు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే రూ.3.41 లక్షలు నగదు, 9 ఎంఎం, 7.65 ఎంఎం రెండు పిస్టల్స్‌తో పాటు క్యారిడ్జ్‌ను, నాలుగు కార్లు, 12 మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. నిందితులందరూ ఇదే తరహా నేరాలు, దోపిడీలకు పాల్పడిన అనుభవం కలిగివున్నట్టు దర్యాప్తులో వెల్లడైందన్నారు. వీరందరిపై ఒడిశా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో దోపిడీ, పోలీసులపై ఫైరింగ్,



చోరీ కేసులకు సంబంధించి 32 కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ కేసుల్లో కొంతమంది నిందితులు ఇప్పటికే జైల్‌కు వెళ్లి వచ్చినట్టు దర్యాప్తులో తేలిందన్నారు. నేరాలను ప్రణాళికాబద్ధంగా, సాంకేతిక పద్ధతులను వినియోగించడం, పట్టుబడకుండా తప్పించుకునేందుకు మార్గాలు అనుసరిస్తుంటారని, వీరి నేరచరిత్రపై మరింత సమాచారం సేకరించేందుకు ఒడిశా పోలీసులతో సమన్వయం చేస్తూ దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఈ దోపిడీ పక్కా ప్లాన్‌తో చేశారని తెలిపారు. గత నెల 7న దోపిడి జరిగినట్టు శ్రీ వెంకటేశ్వర జువెలరీ యజమాని కిల్లంశెట్టి రామకృష్ణారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు తెలిపారు. రామకృష్ణ ఒక్కరే షాప్‌లో ఉంటారని తెలుసుకొని, ఏడుగురు వ్యక్తులు నెంబర్ ప్లేట్లు లేని మూడు మోటార్ సైకిళ్లపై జ్యువెలర్స్ దుకాణం వద్దకు వచ్చారన్నారు. వారు తమను జీఎస్టీ అధికారులుగా చెప్పుకుని, షాప్ తనిఖీ చేయాలంటూ లోపలికి ప్రవేశించారని తెలిపారు. షాప్ లోపలికి వెళ్లిన తర్వాత నిందితులంతా చేతులకు గ్లౌజులు, ముఖాలకు మాస్కులు ధరించి అక్కడ ఉన్న సీసీ కెమెరాలపై నల్ల స్ప్రే చేసి రికార్డు కాకుండా చూసుకున్నారని చెప్పారు. అనంతరం దుకాణం యజమానికి చేతులకు బేడీలు వేసి పిస్టల్స్‌తో బెదిరించి షాపులోని బంగారు ఆభరణాలను దోచుకుని, వాహనాల్లో పరారయ్యారన్నారు. బంగారం దుకాణంలో దోపిడి చేయాలనే ఉద్దేశంతో కాశీబుగ్గకు చెందిన తిరుమల పాత్రోతో కలిసి ఏ2 నిందితుడు 2023 నుంచే పలుమార్లు రెక్కీ నిర్వహించినట్టు దర్యాప్తులో తేలిందన్నారు. మిగతా నిందితులను కాశీబుగ్గకు తీసుకువచ్చి బంగారు దుకాణంపై మరోసారి రెక్కీ నిర్వహించారని, కాశీబుగ్గలో నివసిస్తున్న తిరుమల పాత్రో షాప్‌లో దోపిడి చేయడానికి అవసరమైన రూట్‌మ్యాప్‌ను, ఇతర వివరాలను నిందితులకు అందించి సహకరించాడన్నారు. నేరానికి ముందు, తర్వాత సీసీ కెమెరాలకు చిక్కకుండా ఉండేందుకు టోల్ గేట్ల మార్గాలను తప్పించుకునేందుకు, నిందితులు భువనేశ్వర్ నుంచి బయలుదేరి ఖుర్దా, ఆస్కా దిగబండి, మహేంద్రగిరి, లావణ్యకోట, గండహతి, గారబంద, గొప్పిలి, పెదంచల, చినంచల, కేదారిపురం మార్గంగా



ప్రయాణించినట్లు తెలిపారు. మొత్తం మూడు మోటార్ సైకిళ్లతో పాటు ఒక కారులో ప్రయాణించినట్లు తెలిపారు. కారును కేదారిపురం గ్రామం సమీపంలోని లేఅవుట్‌లో నిలిపి, అక్కడి నుంచి మోటార్ సైకిళ్లపై కాశీబుగ్గ పట్టణానికి చేరుకున్నారన్నారు. రెక్కీ చేసిన అనంతరం బంగారం దుకాణంలోకి ప్రవేశించి బంగారు ఆభరణాలను దోచుకుని అక్కడి నుంచి పరారైనట్లు వివరించారు. పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని కేసును స్పెషల్ టీమ్‌లను నియమించి పూర్తిగా సాంకేతిక ఆధారాల సహాయంతో ఛేదించినట్లు తెలిపారు. నిందితులు నేరానికి ఉపయోగించిన వాహనాలను సీసీ కెమెరాల ద్వారా గుర్తించామన్నారు. ఆ వాహనాల్లో ఒక కారుకు సంబంధించిన వివరాలు సేకరించగా, ఆ కారు మొదట మహీంద్రా ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసినట్టు ఆధారం లభించిందన్నారు. రుణం చెల్లించకపోవడంతో మహీంద్రా ఫైనాన్స్ సంస్థ ఆ కారును స్వాధీనం చేసుకుని వేలం ద్వారా విక్రయించిందన్నారు. ఆ వేలంలో ప్రీతి రంజన్ దాస్ అనే వ్యక్తి కారును కొనుగోలు చేసి, తర్వాత నిందితుడు రామచంద్ర సాహుకు విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. అనంతరం రామచంద్ర సాహు సూచన మేరకు నిందితుడు బానోజీ బెహరా ఒడిశా రాష్ట్రం బలంగిరి గ్రామంలో ఉన్న మహీంద్రా డంపింగ్ యార్డ్ నుంచి ఆ కారును తీసుకువచ్చినట్టు తెలిపారు. కారును తీసుకువచ్చిన సందర్భంగా బానోజీ బెహరా ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్ వివరాలను మహీంద్రా డంపింగ్ యార్డ్ వద్ద నమోదు చేయించినట్టు తెలిపారు. వివరాల ఆధారంగా, సాంకేతిక సాక్ష్యాల ద్వారా మిగతా నిందితుల ఫోన్ నెంబర్లను గుర్తించి, కేసును పూర్తిగా ఛేదించినట్టు ఎస్పీ తెలిపారు.

## ప్రతిభకు ప్రశంస..

ఈ కేసును అదనపు ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో కాశీబుగ్గ సబ్ డివిజనల్ అధికారి టి.భవాని సూచనల మేరకు ఈ కేసును ఛేదించి నిందితులను పట్టుకోవడంలో పోలీసు అధికారులు, సిబ్బంది క్రియాశీలంగా పనిచేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా కేసును పరిష్కరించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విలేకర్ల సమావేశంలో ఇన్‌స్పెక్టర్, కాశీబుగ్గ, ఇచ్ఛాపురం సీఐలు వై.రామకృష్ణ, ఎం.చిన్నన్నాయుడు, ఎస్ఐలు ఆర్.నరసింహమూర్తి, ఎన్.సునీల్, కె.మధుసూదనరావు, రాజేష్, పారినాయుడు, సీహెచ్ గంగరాజ, హెచ్‌సీ గవరయ్య, కానిస్టేబుల్స్ ఉషాకిరణ్, ఎం.నీలకంఠం, మాధవ్, అలీ, షన్ముఖరావు, భాసీర్, లోకనాథం, రాధాకృష్ణ, హరీష్. ఐటి కోర్ సిబ్బంది హెచ్సీ యం.శ్రీధర్‌కుమార్, పీసీలు డి.కె.జె.భరత్‌రెడ్డి, యస్.నరేష్ పాల్గొన్నారు.





# ఏపీ బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ డైరెక్టర్ దాసరి ఇంటిపై దాడి

**మందస, మే 2(వార్త):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరక్టర్ దాసరి తాతారావు ఇంటిపై శనివారం సాయంత్రం రాళ్ల దాడి జరిగింది. మందస మండలంలోని లోహరిబంద పంచాయతీలో గల గొల్లలపాలెం గ్రామంలో తాతరావు నివాసముంటున్నారు. దాసరి తాతారావు భార్య జయలక్ష్మి మందస ఎంపీపీగా పని చేశారు. శనివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు తెలుపు రంగు కారులో వచ్చి, రాళ్ల దాడి చేశారని తాతారావు చెప్పారు. ఆయన ఫిర్యాదు మేరకు మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామంలో విచారణ చేపట్టారు. కారులో వచ్చిందెవరు.. రాళ్ల దాడి చేసిందెవరు.. రాజకీయ కక్షలున్నాయా.. అనే కోణంలో ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు. ఎన్నడూలేని విధంగా ఉద్దానంలో రాళ్ల దాడి కలకలం రేపింది. ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరక్టర్ దాసరి తాతారావు, మాజీ ఎంపీపీ దాసరి జయలక్ష్మి దంపతుల ఇంటిపై దాడిని వారిద్దరూ ఖండించారు.



# ప్రజా దర్బార్‌లో కేంద్ర మంత్రికి వినతి

**సోంపేట, మే 2(వార్త):** సోంపేట పట్టణం, మండలానికి సంబంధించిన అనేక సమస్యలపై కవిటిలో ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ క్యాంప్ కార్యాలయంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్లో మాజీ ఎంపీపీ చిత్రా డ శ్రీనివాసరావు, పలువురు టిడిపి నేతలు కలిసి అనేక సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. జింక భద్ర బెంకిలి పలాసపురం గ్రామాల్లో దశాబ్దాలుగా నెలకొన్న విద్యుత్ సమస్యలు, సోంపేట మెయిన్ రోడ్డు విస్తరణ, మండలంలో సాగునీటి చెరువుల ఆధునీకరణ, ఇంటింటికి కొలాయి నిర్మాణంలో భాగంగా జలజీవన్ మిషన్ సమస్యలు అలాగే ఇటీవల అకాల వర్షాలకు నేలపాలైన టమాట పంటకు నష్టపరిహారం మొదలైన సమస్యలపై వీలైనంత త్వరగా పరిష్కారం చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జుత్తు పురుషోత్తం మద్దు బుద్దేష్ బంధాలం బాబూరావు బల్ల సోను తదితరులు ఉన్నారు.



## హవల్దార్ రవికృష్ణకు ఘన స్వాగతం



**కంచిలి, మే 2 (వార్త):** పెద్ద శ్రీరాంపురం గ్రామానికి చెందిన బల్లెడ రవికృష్ణ ఆర్మీలో 26 ఏళ్ల పాటు విశేష సేవలు అందించి హవల్దారుగా పదవి విరమణ రీత్యా శనివారం స్వగ్రామానికి చేరుకున్న సందర్భంగా గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు ఆధ్వర్యంలో రవికృష్ణ దంపతులకు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. గ్రామం నుంచి భారత సైన్యంలో సుదీర్ఘకాలం పనిచేసి దేశ సేవలో తరించినందుకు ఈ గ్రామం ఎంతగానో గర్వపడుతుందని వక్తలు పేర్కొన్నారు. భరతమాత ముద్దుబిడ్డగా రవికృష్ణ సైన్యంలో పోషించిన పాత్ర ఎంతో చిరస్మరణీయమని అభినందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు, పాల్గొన్నారు.

## చిన్నారి కుటుంబానికి ఆర్థిక సాయం



**మందస, మే 2(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన చిన్నబహడపల్లి గ్రామానికి చెందిన ఏడు నెలల ధనుంజయ అనే బాలుడు లివర్ వ్యాధితో బాధ పడుతున్నాడు. గత కొన్ని రోజులుగా రాగోలు జెమ్స్ హాస్పిటల్ లో లివర్ వ్యాధితో చికిత్స పొందుతున్నాడు. డాక్టర్స్ కాలేయ మార్పిడి అత్యంత అవసరం చెప్పారు. దాతల సహకారంతో స్వామి వివేకానంద సేవా సమితి 10,000 రూపాయలు ఆర్థిక సాయాన్ని ధనుంజయ కుటుంబానికి అందజేశారు. స్వామి వివేకానంద సేవా సమితి ఉదారతకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో స్వామి వివేకానంద సేవా సమితి ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## బూరగాంలో ఉత్తమ విద్యార్థులకు సత్కారం



**కంచిలి, మే 2(వార్త):** బూరగాం గ్రామంలో ఇటీవల విడుదలైన పదో తరగతి ఇంటర్మీడియట్ ఫలితాల్లో గ్రామానికి చెందిన ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శనివారం ప్రజాప్రతినిధుల సమక్షంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను అభినందిస్తూ వారిని స్ఫూర్తిగా తీసుకొని మిగతా విద్యార్థులు కూడా చదువుల్లో మంచి ప్రతిభ సాధించాలని కోరారు. పదో తరగతిలో సింహాద్రి హాసిని (589) బద్రి సౌజన్య(587) బొట్టా శ్రీకర్(587) బద్రి మధులత (574), ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన బొడ్డు శ్రీవిద్య (461) నన్ను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి, దుర్గాసి ధర్మారావు, కొనపల సురేష్, మద్దు వెంకటరావు మద్దు అది యాదవ్ బట్ట చిన్నారావు బి షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

## శాసనాంలో ఘనంగా సంబరాలు ప్రారంభం



**సోంపేట, మే 2 (వార్త):** తురక శాసనాం గ్రామంలో శ్రీ కాల్లెమ్మ ముక్కెర పోలమ్మ నీలమణి దుర్గ అమ్మవారి సంబరం మహోత్సవాలు శనివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయా అమ్మవార్లను దేవాలయాలనుంచి గ్రామంలోకి ఆహ్వానించిన ఘట్టం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా బాణాసంచా కాల్పులు వీధి నాటకాలు వివిధ వేషాధారణలతో కాళికా నృత్యాలతో శాసనం గ్రామం సంబరాలు అంబరాన్ని అంటాయి. ఉత్సవాలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పట్టణాలనుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకున్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా గ్రామస్తులు తగు చర్యలు తీసుకున్నారు.



## కంచిలి గురుకులం..

# పదో తరగతి ఫలితాల్లో ప్రతికూలం

**-దిగజారిన ఉత్తీర్ణత**

**-మండలంలోనే అత్యంత అధమ స్థానం**



**కంచిలి, మే 2 (వార్త):** పేరు గొప్ప... ఊరు దిబ్బ అన్న సామెతల తయారయింది కంచిలి మండల కేంద్రంలో గల ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ పరిస్థితి. దీన్నే ముద్దుగా గురుకుల పాఠశాల అని పిలుస్తుంటారు. కాలక్రమేనా దీన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ స్కూల్ గా పిలుస్తున్నారు. తాజాగా వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఈ పాఠశాల కంచిలి మండలంలోనే అత్యంత అధమ స్థానంలో నిలిచిందంటే అతిశయోక్తి కాదు. ఈ ఏడాది రాష్ట్రంలో ప్రతి జిల్లాలోనూ ప్రతి మండలంలోనూ ప్రభుత్వ పాఠశాలల హవా పదో తరగతి ఫలితాల్లో కొనసాగింది. ప్రభుత్వం కూడా దీన్ని ఎంతో ఘనంగా ప్రచారం చేసుకుంది. కంచిలి గురుకులం పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా మారింది. పదో తరగతి పరీక్షలకు ఈ పాఠశాల నుంచి 69 మంది విద్యార్థులు హాజరు కాగా కేవలం 48 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 21 మంది పరీక్ష తప్పడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఉత్తీర్ణత పొందిన వారిలో కేవలం ఐదుగురు మాత్రమే 500 కు పైగా ఇక్కడ మార్కులు సాధించారు. అత్యధికంగా ఈ పాఠశాలలో 551 మార్కులు చొప్పున ఇద్దరు విద్యార్థులు సాధించడం విశేషం. ఈ ఫలితాలను గమనించిన ప్రతి ఒక్కరూ నిజంగా ఇవి గురుకులం ఫలితాలే నా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంవత్సరం పొడవునా రేయింభవళ్ళు విద్యార్థులు ఇక్కడే చదువుకుంటూ ఇక్కడే విశ్రాంతి పొందుతూ ఇక్కడే భోజన సదుపాయాలను పొందుతున్న విషయం తెలిసిందే. ఇటువంటి ప్రతిష్టాత్మక పాఠశాలలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కూడా కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తుంది. ఒకవైపు అధునాతన భవనాల నిర్మాణం మరోవైపు ప్రత్యేక భోజనశాల ఇంకోవైపు విద్యార్థులకు పడకగదులు ఇలా ఎన్నో సదుపాయాలతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలకు జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది.

### ఏమాత్రం పోటీ ఇవ్వలేని పరిస్థితి :

కంచిలి మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు పది ఫలితాల్లో గురుకుల పాఠశాల ఏమాత్రం కూడా పోటీ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. మండలంలో జలంత్రకోట, ముండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు పదిలో 100% ఫలితాలు సాధించాయి. నువ్వాగడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 97% ఫలితాలు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 87% బూరగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 85% ఫలితాలు రాబట్టారు. మిగతా ఉన్నత పాఠశాలలో 70% పైగా ఫలితాలు లభించాయి. గురుకులం మాత్రం 69 శాతానికి దిగజారిపోవడం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఎన్నో ఆశలతో గురుకులంలోకి...

ముఖ్యంగా దళిత సామాజిక వర్గాలను విద్యాపరంగా మరింత ఉన్నత స్థాయికి చేర్చే విధంగా ప్రభుత్వం ఇటువంటి గురుకుల పాఠశాలలను అనేక మండలాల్లో విశాలమైన విస్తీర్ణంలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలతో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ పాఠశాలలో ఒక్కొక్క సెక్షన్కు బీసీల నుంచి కేవలం నలుగురికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. ఇటువంటి పాఠశాలల్లో మంచి నాణ్యమైన విద్య లభిస్తుందని ఐదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే ఇటువంటి చోట పదవ తరగతి చదివేసరికి విద్యార్థి మంచి తెలివితేటలతో రాటుదేలుతారని తల్లిదండ్రులు ఇతరులు భావిస్తున్నారు. ఇటువంటి పాఠశాలల్లో సీట్ల కోసం ఎంతో గిరాకీ ఉంటుంది. రాజకీయ నేతల రికమండేషన్లు కూడా జరుగుతుంటాయి. అటువంటి కంచిలి గురుకులం ఫలితాల్లో నేలచూపులు చూడడం అందరినీ విస్తు పోయేలా చేసింది. ఎన్నో ఆశలు పెట్టుకున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఈ ఫలితాల వల్ల అడియాసలు తప్పలేదు. ఈ ఏడాది పదిలో 21 మంది విద్యార్థులు ఉత్తీర్ణతకు నోచుకోకపోవడం చాలా బాధాకరం అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సంవత్సరం పొడవునా వీరికి అందించిన విద్యాబోధన నిర్వహించిన పరీక్షలు వాటిలో వచ్చిన మార్కులను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటూ ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించేందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేయడంలో యాజమాన్యం విఫలమైందంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### జిల్లా అధికారుల నుంచి చీవాట్లు :

కంచిలి గురుకులంలో పది ఫలితాలు పట్ల జిల్లా అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. పాఠశాల యాజమాన్యానికి చివాట్లు పెట్టి సంబంధించిన పదో తరగతి విద్యార్థుల మొత్తం ఏడాది నివేదికను శ్రీకాకుళం జిల్లా కార్యాలయానికి వెంటనే అందజేయాలని కోరినట్లు తెలుస్తోంది. రెండో రోజు నుంచే ఈ నివేదిక తయారీలో యాజమాన్యం సిబ్బంది తలమునకలై ఉన్నారు.

ఏమైనాప్పటికీ మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నప్పటికీ కీలకమైన గురుకులంలో ఫలితాలు పాఠశాల ప్రతిష్ట దిగజార్చిన నేపథ్యంలో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది.

## మత్స్యకారులపై అటవీశాఖ దౌర్జన్యాన్ని అడ్డుకోండి



**సోంపేట, మే 2 (వార్త):** సోంపేట కవిటి తదితర మండలాల్లో సముద్ర తీరంలో నివసిస్తున్న మత్స్యకారుల పట్ల అటవీశాఖ అధికారులు సిబ్బంది చేపడుతున్న దౌర్జన్యాలను ప్రభుత్వం వెంటనే అడ్డుకోవాలని మత్స్యకారులకు రక్షణ కల్పించాలని మత్స్యకార కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్దు రాజారావు శుక్రవారం రాత్రి ఎకవూరు గ్రామంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ తో కలిసి నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో వినతి పత్రం అందించి వివరించారు. పూర్వకాలం నుంచి సముద్ర దిబ్బలపై ఇండ్లు గ్రామాలు నిర్మించుకొని నివసిస్తున్న మత్స్యకారులపై ఆ స్థలాలు, భూములు ఫారెస్ట్ భూములంటూ బెదిరిస్తూ ఇండ్ల స్థలాలులో సిమెంట్ స్తంభాలు పాతుతూ నానా యాగి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులు ఏర్పాటు చేసుకున్న స్మశాన స్థలాలు కూడా తమవేనంటూ అక్కడ దహన సంస్కారాలు జరగకుండా అమానవీయంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామం నుంచి బయటకు వెళ్లే దారులు కూడా అడ్డుకుంటూ మత్స్యకారులకు ఇక్కట్లకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. సోంపేట మండలం రామయ్య పట్నం నుంచి అటు బారువా వైపు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం చేపట్టడం కోసం చేస్తున్న తీవ్ర ప్రయత్నాలను అటవీ శాఖ గండి కొడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూములపై నిజంగా వీళ్ళకి హక్కులు లేవని అన్నారు.

జిల్లా కలెక్టర్లు అనుమతులు మంజూరు చేస్తున్న అటవీ శాఖ కొర్రీలు వేస్తూ దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణం అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. సముద్ర తీరంపై అనేక అలజడులు ఎదుర్కొంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నివసిస్తున్న నిరుపేద మత్స్యకారులకు తీరంపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న మత్స్యకార జనాభా అవసరాల దృశ్య సముద్రతీరం భూములను ఆయా గ్రామాలకు హక్కు కల్పించాలని కోరారు.

## ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉత్తమ విద్య



**మందస, మే 2(వార్త):** ప్రభుత్వ బడుల్లో ఉత్తమ విద్య దొరుకుతుందని, దీంతోనే పరీక్షల్లో మంచి ఫలితాలను విద్యార్థులు సాధించగలుగుతున్నారని వక్తలు అన్నారు. ఇటీవల విడుదలైన ఎస్ఎస్సి ఫలితాలలో పల్లిసారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంతో వారికి శనివారం వారిని అభినందించి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులందరూ ప్రథమ శ్రేణి మార్కులు పొందడం వెనుక ఉపాధ్యాయులు ప్రత్యేక స్టడీ అవర్ల నిర్వహణ తోబాటు విద్యార్థులు క్రమశిక్షణతో చదవడానికి తగిన మార్గదర్శకత్వాన్ని వహించడమే కారణమన్నారు. పాఠశాలకు తగిన సౌకర్యాలు కల్పనకు , ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేరికకు గ్రామం ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. దున్న నక్షత్ర 573మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానంతో పాటు మండల ద్వితీయ స్థానాన్ని, తామాడ హరీష్ తేజ 546మార్కులతో పాఠశాల ద్వితీయ స్థానాన్ని, సామల సౌభాగ్య 542మార్కులతో పాఠశాల తృతీయ స్థానాన్ని సంపాదించుకోవడం పట్ల ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల పాఠశాల నిర్వహణ కమిటీ చైర్ పర్సన్ దున్న కవితారమేష్, ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి ఉదయ్ కుమార్, గ్రామ మాజీ సర్పంచ్ బత్తిని కుసుమ హేమంతరావు, మాజీ సర్పంచ్ పోతనపల్లి షణ్ముఖరావు, గ్రామ అభివృద్ధి సంఘం సెక్రటరీ తామడ ఈశ్వర రావు, ట్రెజరర్ తామాడ సోమేశ్వరరావు, యువజన సంఘాల ప్రతినిధులు విద్యార్థులను, ఉపాధ్యాయులను ప్రత్యేక సమావేశంలో అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యవ్వారి కాంతారావు, ఉపాధ్యాయులు గుంట కోదండరావు, కె.మాధవరావు, ఎస్.పాపారావు, ఎన్.విష్ణుమూర్తి, గ్రామ కాంట్రాక్టర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సుధీర్ కుటుంబానికి బల్ల పరామర్శ



**పలాస, మే 2 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ఉదయపురం వీధికి చెందినవైయస్సార్ పార్టీ కార్యకర్త కొండల సుధీర్ అకాల మరణంతో ఆ కుటుంబానికి తీరనిలోటని, అతని ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శనివారం మా కుటుంబానికి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ప్రతినిధి రోనంకి వెంకటరమణ, పి లక్ష్మణరావు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పది టాపర్లకు లైబ్రరీలో ఘన సన్మానం



**మందస, మే 2(వార్త):** మందస మండలంలోని పదవ తరగతి (ఎస్ఎస్సీ) ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మందస పట్టణంలోని 'ఒరియా యంగ్‌మెన్స్ లైబ్రరీ' ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. 2026 విద్యా సంవత్సరానికి మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఐదుగురు ఒరియా విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి, మండల స్థాయిలోనే టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా లైబ్రరీ ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు కష్టపడి చదివి మండల స్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణమని కొనియాడారు. ప్రతిభావంతులైన విద్యార్థులు బిస్వాల జాస్మిన్ 590/600(చిన్నకోస్తా), సంపదగౌడో 589/600(మందస), ధనుష్ బెహరా 589/600(కృష్ణాపురం), కార్తీక్ గౌడో 588/600(మందస), నందిని మల్లికో 585/600(పొత్తంగి-సిరిపురం)లను జ్ఞాపికలు అందజేసి, వారిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు ఒరియా యంగ్‌మెన్స్ లైబ్రరీ సభ్యులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో వీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## ప్రజలకు మెరుగైన పారిశుధ్య వసతులు

**ఇచ్ఛాపురం, మే 2 (వార్త):** స్వచ్ఛ సర్వేక్షన్ 2025 -26 లో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ డిపార్ట్మెంట్ సమక్షంలో దేశంలో ఉన్న అన్ని పట్టణ స్థానిక సంస్థలు లో ప్రజలకు మెరుగైన పారిశుధ్య వసతులను కల్పించాలని ఉద్దేశ్యముతో ప్రజల నుండి సిటిజెన్ ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఇందులో మొత్తం 13 ప్రశ్నలకు ప్రజలు స్వచ్ఛందంగా వారి అభిప్రాయం వ్యక్తం చేయవచ్చు.. ఈ కార్యక్రమంలో భాగంగా ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో స్థానిక సురంగి రాజావారి మున్సిపల్ కమిషనర్ రమేష్ సమక్షంలో వాకర్స్ , క్రీడాకారుల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవడంతో పాటు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుటలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని, అందరి సహకారంతో మాత్రమే "స్వచ్ఛ ఇచ్ఛాపురం"సాకారం అవుతుంది అని కమిషనర్ తెలిపారు.. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర కుమార్ ఫారిడా, పర్యావరణ కార్యదర్శులు, వాకర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## బుడితిలో ఆకస్మిక పర్యటన

**- పారిశుధ్య లేమిపై ఎంపీడీవో అగ్రహం**

**సారవకోట, మే 2 (వార్త):** గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచేందుకు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మురళి మోహన్ కుమార్ సూచించారు. శనివారం సారవకోట మండలం బుడితి పంచాయతీలో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రహదారులపై పేరుకుపోయిన చెత్తచెదారాలను పరిశీలించి, ఎక్కడికక్కడ ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశించారు. గ్రామాల్లో పరిశుభ్రతపై నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామాల్లో శుభ్రతను కాపాడేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



# కార్మిక వ్యతిరేక విధానాలు విరమించుకోవాలి

**-నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలి**

**- కార్మిక చట్టాల అమలు చేయాలి**

**- పగతి శీల కార్మిక సమాఖ్య పికేఎస్ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల్లో భాగంగా బహిరంగ సభ**




**పలాస, మే 2 (వార్త):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు విరమించుకోవాలని, 4 లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, కార్మిక చట్టాల అమలు చేయాలని పలు ప్రజాసంఘ నాయకులు డిమాండ్ చేశారు. పలాస మండలం బొడ్డ పాడులో అమరుల స్మారక భవనం నందు మేడే వారోత్సవాల్లో భాగంగా ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా మేడే పతకాన్ని నిర్మాణ రంగ మేస్త్రి రామ్ శాహు, ప్రగతి శీల కార్మిక సమాఖ్య జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధనలు ఆవిష్కరించారు. అనంతరం పి కే ఎస్ జిల్లా అధ్యక్షులు మద్దిల ధర్మారావు అధ్యక్షతన శనివారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ 1886లో చికాగో కార్మికులు పనిగంటల కోసం పోరాటం చేసి 20 మంది వరకు కార్మిక హక్కుల కోసం అమరులయ్యారని, వారి త్యాగాల స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా మేడే కార్యక్రమాలను అన్ని రంగాల కార్మికులు, కర్షకులు జరుపుకుంటారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 2014 తర్వాత కేంద్రంలో అధికారం చేపట్టిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మిక హక్కులు కాలరాస్తుందని, లేబర్ కోడ్ వల్ల కార్మికులు తమ హక్కులు కోల్పోయారని, శ్రమకు తగ్గ ఫలితం కనీస వేతనం అడిగే హక్కు గాని, కార్మిక సంఘాలు నిర్మించుకునే హక్కుకాని, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేసే పరిస్థితి కార్మికులకు ఉత్పన్నమైందని, ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచి కార్మికుల శ్రమను కోర్పరేట్లకు పెట్టుబడిదారులకు దోచుకునే అవకాశం కల్పించిందని, ఈ దేశంలో ఉన్న కోట్లాదిమంది అసంఘటిత రంగ కార్మికులకు భద్రత లేకుండా చేసిందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయని, నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు యధావిధిగా అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కార్మిక చట్టాలు హక్కులు కోసం కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మే నెల ఒకటో తేదీ నుండి మే 5వ తేదీ కారల్ మార్క్స్ జయంతి వరకు మేడే వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని ప్రగతిశీల కార్మిక సమాక్య రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ సభ నిర్వహించడం జరిగిందని అన్నారు. ప్రగతి శీల కార్మిక సమాఖ్య కళాకారుల బృందం సాలిన ఈశ్వరరావు రాపాక చిరంజీవిలు మురిపింటి గంగయ్య షణ్ముఖరావు లత తదితరులు విప్లవ గేయాలు ఆలపించారు. ఈ సభలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే మస్తాన్, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి దుర్యోధన, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పి దాణేష్, అమరుల బంధుమిత్రుల సంఘం నాయకులు జోగి కోదండరావు, తామాడ త్రిలోచన రావు, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం పిడిఎం నాయకులు సాలిన విరాస్వామి, రైతాంగ సమస్యల సాధన సమితి నాయకులు దాసరి శ్రీరాములు, కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కొమర వాసు, దేవాడ నారాయణ రావు, కారీ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద కరగాం పాఠశాలను పునఃప్రారంభించాలి



**నరసన్నపేట, మే 2 (వార్త):** పెద్ద కరగాం గ్రామంలో ఏడేళ్ల క్రితం విద్యార్థులు లేరనే కారణంతో మూసివేసిన ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రస్తుతం గ్రామంలో చదివే పిల్లలు ఉన్నప్పటికీ, వారు దూరంలో ఉన్న చిన్న కరగాం పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని గ్రామస్థులు తెలిపారు. చిన్నారులకు ఇది ఇబ్బందికరంగా మారుతోందని, తమ గ్రామంలోనే పాఠశాల తిరిగి ప్రారంభించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్న ఈ సమయంలో తమ గ్రామ బడిని పునఃప్రారంభిస్తే విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. సంబంధిత అధికారులు సమస్యను గుర్తించి తక్షణ చర్యలు తీసుకుని పాఠశాలను తిరిగి ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి

**-జలుమూరులో విద్యాశాఖ సమీక్ష**



**జలుమూరు, మే 2 (వార్త):** వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె. రవిబాబు సూచించారు. శనివారం జలుమూరు ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈఓలు, స్థానిక సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కోసం ప్రత్యేక డ్రైవులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో చేరే విద్యార్థుల వివరాలను యుడైస్ (ఖఇ×ూజు)లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య పెరుగుదల కోసం మరింత కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరగడానికి అవగాహన కార్యక్రమాలను మరింత విస్తరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


## విజయ్‌మిత్రకు దాసరి లెజెండ్ అవార్డు



**సారవకోట, మే 2 (వార్త):** సారవకోట గ్రామానికి చెందిన జోస్యుల విజయ్ మిత్ర దాసరి నారాయణరావు లెజెండ్ ఫిల్మ్ అవార్డును అందుకున్నారు. హైదరాబాదులోని ప్రసాద్ ల్యాబ్‌లో శుక్రవారం రాత్రి జరిగిన వేడుకలో ఈ అవార్డును స్వీకరించారు. విజయ్ మిత్ర కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించిన “100 డేస్ లవ్ స్టోరీ” చిత్రానికి గాను ఈ పురస్కారం లభించింది. ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీనివాస్, హీరో సుమన్ చేతుల మీదుగా నిర్వాహకులు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మిత్ర మాట్లాడుతూ, ఈ అవార్డు తనకు మరింత ప్రోత్సాహాన్ని అందించిందని, భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సారవకోటకు చెందిన వ్యక్తి ఈ స్థాయి గుర్తింపు పొందడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


## కోమర్తి కూడలిలో భారీ వృక్షం కూలి రాకపోకలకు అంతరాయం

**నరసన్నపేట, మే 2 (వార్త):** కోమర్తి ప్రధాన కూడలి వద్ద శుక్రవారం సాయంత్రం పెనుగాలులతో పాటు కురిసిన భారీ వర్షానికి ఓ పెద్ద వృక్షం నేలకొరిగింది. దీంతో రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ రహదారి గుండా పలు గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాలు నిలిచిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. తదనంతరం స్థానికులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రహదారికి అడ్డంగా పడిన చెట్టు కొమ్మలను తొలగించి మార్గాన్ని సాఫీ చేశారు. అధికారులు వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



## రైతులకు మెరుగైన సేవలపై దృష్టి

**- సారవకోట డీసీసీబీ పరిశీలన**



**సారవకోట, మే 2 (వార్త):** డీసీసీబీల ద్వారా రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని డీసీసీబీ ఛైర్మన్ సూర్యనారాయణ తెలిపారు. శనివారం సారవకోట డీసీసీబీ బ్యాంకును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాంక్‌లో సిబ్బంది హాజరు, రోజువారీ లావాదేవీలు, బకాయిల పరిస్థితి, రైతులకు అందిస్తున్న రుణాల వివరాలను మేనేజర్ సరోజను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకింగ్ సేవలు రైతులకు సులభంగా, సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన ఆర్థిక సహాయం అందించడంలో డీసీసీబీ బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. సేవల నాణ్యతను మెరుగుపరచి రైతుల విశ్వాసాన్ని పెంపొందించాలని అధికారులను ఆదేశించారు.

## టాపర్లకు ప్రోత్సాహక నగదు



**సారవకోట, మే 2 (వార్త):** బుడితి జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి ఫలితాల్లో 586 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థి మాసవరపు గుణచరణ్‌ను శుక్రవారం ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రావాడ యోగి రూ.5,000ల నగదు బహుమతిని అందజేశారు. అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన మనీషా (585), చిన్న కిట్టాలపాడు విద్యార్థిని మేఘన (585)లకు చెరో రూ.3,000లు అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన కస్తూరిబా పాఠశాల విద్యార్థిని వర్షిత (582)కు రూ.2,000ల నగదు బహుమతిని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి వారి కృషితో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కూడా కారణమని పేర్కొన్నారు.

## మాకివలసలో స్పెషల్ డ్రైవ్

**నరసన్నపేట, మే 2(వార్త):** మాకివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శనివారం ఉదయం నిర్వహించిన ప్రత్యేక నమోదు కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) పేడాడ దాలినాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ప్రథమ స్థానాలు సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, సదుపాయాలను వినియోగించుకుని విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని, వారి భవిష్యత్తు కోసం ఇది మంచిదని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రైల్వే పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థలాన్ని గుర్తించండి



**ఇచ్ఛాపురం, మే 2 (వార్త):** ఇచ్ఛాపురం పర్యటనలో భాగంగా నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కి తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జైదేవ్ ఐదు ముఖ్యమైన ప్రజా సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇచ్ఛాపురం మండలం మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని 20వ వార్డులో కొండపోలమ్మ కాలనీ, గాంధీనగర్ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాల వంటి ప్రాథమిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే అభివృద్ధి చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే రైల్వే నార్త్ కేబిన్ సమీపంలోని ఎల్ సి గేటు నంబర్ 329 వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి తగిన ప్రదేశాన్ని ఖరారు చేసి టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని, అదే ప్రాంతంలో రోడ్డు అండర్ బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 1, 2, 3, 21 మరియు 22 వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నందున శాశ్వత పరిష్కారం కోసం పైప్‌లైన్ వ్యవస్థ బలోపేతం చేయాలని, ట్యాంకర్లపై ఆధారాన్ని తగ్గించాలని మంత్రి గారిని విజ్ఞప్తి చేశారు.

వంశధార నది నుండి ఇచ్ఛాపురం మండలంలోని రైతులకు, ముఖ్యంగా బాలకృష్ణపురం మీదుగా ముచ్చింద్ర, కేదారిపురం గ్రామాల వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఇచ్ఛాపురం మండల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పర్యావరణహిత పరిశ్రమలను ప్రోత్సహించి స్థానికంగా ఉద్యోగ అవకాశాలు సృష్టించాలని మరో వినతిపత్రంలో కోరారు ఈ కార్యక్రమంలో అతనితో పాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కాళ్ళ ధర్మారావు , 17వ వార్డు ఇంచార్జి జన్నెల సంతోష్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్

**- ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, మే 2 (వార్త):** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ ప్రధాన లక్షమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం పలాస టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని పార్టీ కార్యాలయంలో సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో సమర్పించారు. ఈ ప్రజా దర్బార్‌లో 25 వినతలను స్వీకరించారు. ముఖ్యంగా భూ వివాదాలు, గ్రామీణ, పట్టణ ప్రాంత రహదారి సమస్యలు, డ్రైనేజీ సమస్యలు, పెన్షన్ మంజూరు, లోవోల్టేజ్, తాగునీటి సరఫరా లోపాలు తదితర ప్రజా సమస్యలకు సంబంధించిన వినతులు అందాయి. ప్రతి సమస్యను శ్రద్ధగా పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, పరిష్కరించేందుకు ఇలాంటి ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీముఖలింగేశ్వర స్వామికి వైశాఖ పౌర్ణమి ఏకాంత సేవ

**జలుమూరు, మే 2 (వార్త):** జలుమూరు మండలం శ్రీముఖలింగంలో కొలువై ఉన్న శ్రీముఖలింగేశ్వర స్వామికి వైశాఖమాసం బహుళ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి భక్తిశ్రద్ధలతో ఏకాంత సేవ నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం రాత్రి పార్వతీ పరమేశ్వరులను ఉయ్యాలలో అలంకరించి ఏకాంత సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వైశాఖమాసంలో ఈ విధంగా ఏకాంత సేవ నిర్వహించడం ఆలయంలో సంప్రదాయంగా కొనసాగుతున్నదని ఆలయ అధికారులు తెలిపారు. ఈ పూజలతో భక్తులకు ఆధ్యాత్మిక ఆనందం కలుగుతుందని పేర్కొన్నారు.



## శక్తి యాప్‌పై అవగాహన



**నరసన్నపేట, మే 2(వార్త):** నిత్యం ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిలో ప్రాణనష్టాలు కూడా చోటుచేసుకుంటున్నాయని ఎస్సై-2 శేఖర్‌రావు తెలిపారు. శనివారం నరసన్నపేట సచివాలయంలో స్థానికులకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో ద్రాక్షాయిని, శక్తి టీం సభ్యులు శ్రీనివాసరావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గుగ్గిలి వద్ద రోడ్డుపై పడిన విద్యుత్ స్తంభం

### -పమాద భయం - చర్యలకు విజ్ఞప్తి




**జలుమూరు, మే 2 (వార్త):** గుగ్గిలి గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం పడిపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. శుక్రవారం రాత్రి వీచిన భారీ గాలులకు ఈ స్తంభం కూలిపోయినప్పటికీ, ఇప్పటివరకు తొలగించకపోవడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. వాహనాలు రోడ్డు పక్కగా ప్రయాణం చేస్తుండగా, స్తంభానికి విద్యుత్ తీగలు కూడా అనుసంధానంగా ఉండటం వల్ల ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశముందని ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని వారు చెబుతున్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి స్తంభాన్ని తొలగించి రహదారిని సురక్షితంగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుత పరిస్థితిపై అధికారులు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు.

## సైనికుల కుటుంబాలకు 'వీర్ పరివార్' అండ




**శ్రీకాకుళం లీగల్, మే2 (వార్త):**దేశ సరిహద్దుల్లో విధి నిర్వహణలో ఉన్న సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వీర్ పరివార్ సహాయత యోజన-2025' ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. హరిబాబు తెలిపారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని లీగల్ సర్వీస్ అథారిటీ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, సైనిక కుటుంబాలకు ఎదురయ్యే ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలు, ఇతర న్యాయపరమైన చిక్కులను ఈ పథకం ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. దేశ రక్షణలో నిమగ్నమైన సైనికులు తమ ఇంటి వద్ద సమస్యల పట్ల ఆందోళన చెందకుండా ఉండటమే ఈ పథక ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. జిల్లా, రాష్ట్ర జాతీయ సైనిక సంక్షేమ బోర్డుల సమన్వయంతో ఈ పథకం పనిచేస్తుందని, ఇందులో అనుభవజ్ఞులైన సీనియర్ న్యాయవాదులు, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉండి తగిన న్యాయ సలహాలు అందిస్తారని జడ్జి వివరించారు. శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే ఈ పథకం కింద పలు సైనిక కుటుంబాల సమస్యలను విజయవంతంగా పరిష్కరించామని ఆయన వెల్లడించారు. ఈ సమీక్షా సమావేశంలో పోలీస్, రెవెన్యూ, సైనిక సంక్షేమ గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు పాల్గొని, పథకం అమలులో క్షేత్రస్థాయి సహకారంపై చర్చించారు. న్యాయపరమైన ఇబ్బందులు ఉన్న సైనిక కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

## రాజకీయ పార్టీలతో సమావేశం

**శ్రీకాకుళం, మే2 (వార్త):**శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో వున్న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం శ్రీకాకుళం రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఆర్డీవో సాయి ప్రత్యుష ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. 2002 ఓటర్లు జాబితాతో 2026 ఓటర్లు జాబితా మాపింగ్ ప్రక్రియ మాపింగ్ సంబంధించి చర్చించారు. గార మండలంలో 77.74శాతం, శ్రీకాకుళం రూరల్ 79.86 శాతం, శ్రీకాకుళం అర్బన్‌లో 47 శాతం మ్యాపింగ్ పూర్తయిందని ఆర్డీవో తెలిపారు. మిగిలిన ఓటర్లు మాపింగ్ చేయుటకు రాజకీయ పార్టీల వారీగా బూత్ లెవెల్ ఏజెంట్లకు సహకరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు గణపతి రావు, చక్రవర్తి, జానకి , శ్రీకాకుళం ఎన్నికల ఉప తహసిల్దార్ జి.కె.శ్రీనివాసరావు, కాంగ్రెస్ నుంచి ఈశ్వరి, వైసీపీ నుంచి శంకరరావు, టీడీపీ నుంచి వెంకటేష్, శ్రీనివాస్‌రావు, రాధాకృష్ణరెడ్డి, జనసేన నుంచి భాస్కరరావు పాల్గొన్నారు.



# బహడపల్లి విప్లవ సేనాని సాలిన

### -ఉద్యమ చరితలో

### భోగారావుకు ప్రత్యేక స్థానం

### బహడపల్లిలో ఆయనకు స్థూపం





**మందస, మే 2(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతం ఉద్యమాలకు పుట్టినిల్లు. విప్లవ భావాలు ప్రజల్లో కనిపిస్తాయి. బహడపల్లి గ్రామానికి మంచి ఉద్యమ చరిత్ర ఉంది. విప్లవోద్యమంలో కొందరు అమరులు కాగా.. భూస్వామ్య వ్యవస్థపై ఓ సామాన్యుడు పోరాడి.. అమరత్వం పొందాడు. ఆయన పోరాటాలకు గుర్తుగా బహడపల్లిలో నేటికీ అరుణ వర్ణంతో స్థూపం చూపరులను ఆకట్టుకుంటుంది.. ఆయన పేరే సాలిన భోగారావు. బహడపల్లి గడ్డపై విప్లవ జెండా ఎగిరిందంటే అది సాలిని భోగారావు వంటి వీరులు చిందించిన రక్తపు చలవేనని స్థానికులు నమ్ముతారు. భూస్వామ్య వ్యవస్థ గడగడలాడిన ఆ రోజుల్లో, పేద ప్రజల పక్షాన నిలబడి, అన్యాయాన్ని ఎదిరించిన అసలు సిసలైన ప్రజా నాయకుడు భోగారావుగా చెబుతారు.

### అణచివేతపై తిరుగుబాటు

ఒకప్పుడు బహడపల్లి ప్రాంతంలో భూస్వాముల ఆగడాలు మితిమీరి ఉండేవి. సామాన్య రైతులకు, కూలీలకు కనీస ఆత్మగౌరవం ఉండేది కాదు. అటువంటి సమయంలో మనం ఎందుకు బానిసలుగా ఉండాలి?" అని ప్రశ్నించిన మొదటి గొంతుక భోగారావు. పేదవారి శ్రమను దోచుకునే వ్యవస్థపై ఆయన విప్లవ శంఖం పూరించారు.

### భూమి కోసం.. భుక్తి కోసం..

భోగారావు పోరాటంలో ప్రధానాంశం 'భూమి'. దున్నేవాడికే భూమి దక్కాలని, పేదవాడికి కడుపు నిండా తిండి ఉండాలని ఆయన ఆకాంక్షించారు. బహడపల్లి, చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలను ఏకం చేసి, భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా వారిని ఒక సైన్యంగా తీర్చిదిద్దారు. ఆయన మాట ప్రజల్లో ఒక తెగింపును, ధైర్యాన్ని నింపింది.

### ప్రజా యుద్ధనౌక

ఆయన కేవలం సిద్ధాంతాలు చెప్పే వ్యక్తి కాదు, క్షేత్రస్థాయిలో ఉండి పోరాటం నడిపిన వీరుడు. అణగారిన వర్గాల గళం వినిపించడంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారు. ప్రజల కోసం ప్రాణాలైనా ఇస్తాను కానీ, అన్యాయానికి తలవంచను అన్న ఆయన నినాదం బహడపల్లి వీధుల్లో మార్మోగేది.

### అమరత్వం-ఒక చరిత్ర

ప్రజల హక్కుల కోసం పోరాడుతూనే ఆయన తన ప్రాణాలను త్యాగం చేశారు. ఆయన మరణం బహడపల్లి ప్రజలకు తీరని లోటు మిగిల్చినప్పటికీ, ఆయన రక్తం ఈ గడ్డపై విప్లవ స్ఫూర్తిని మరింత రగిలించింది. 1988వ సంవత్సరంలో భోగారావు మరణించారు. ఒక రైతు బిడ్డగా పుట్టి, ప్రజల గుండెల్లో 'దేవుడు'గా కొలువబడే స్థాయికి ఆయన ఎదిగారు.

### నేటికీ సజీవమైన ఆశయాలు

శ్రామికులు జరుపుకొనే మేడే స్ఫూర్తిలో భోగారావు పాత్ర ఎంతో ఉంది. ఆయన కన్న కలలు - అంటే పేదవాడి బతుకులో మార్పు, శ్రమకు తగిన ఫలితం - ఇంకా పూర్తిగా నెరవేరాల్సి ఉంది. ఆయన చూపిన బాటలో నడవడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని ప్రజలు చెప్పుకొంటారు. సాలిన భోగారావు గారి పేరు వింటే నేటికీ అన్యాయం చేసే శక్తులకు భయం పుడుతుంది. బహడపల్లి చరిత్రలో ఆయన ఒక చెరగని ముద్ర. ఆ విప్లవ వీరుడి త్యాగాన్ని స్మరిస్తూ, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అభ్యుదయవాదులు కోరుతుంటారు.

# జగద్గురు కృపాలు యూనివర్సిటీని వినియోగించుకోవాలి



**ఇచ్ఛాపురం, మే 2 (వార్త):** జిల్లా వాసులకు చేరువలో భువనేశ్వర్ - కటక్ పట్టణాల మధ్య కొత్త విశ్వవిద్యాలయం 100 ఎకరాలలో ఏర్పాటు చేసినట్లు నిర్వాహికులు తెలిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఆధునిక వసతులతో ఏ ఐ ఆధారిత అభ్యాస వ్యవస్థ,వినూత్న కార్యక్రమాలు, పరిశ్రమ గుర్తింపు మరియు ఉపాధి కల్పన ఫ్రేమ్‌వర్క్ తో కూడిన నైపుణ్య కోర్సులు ప్రత్యేకంగా ఉంటాయని నిర్వాహకులు పూర్ణ చంద్ర బ్రహ్మ తెలిపారు. ఆధ్యాత్మిక సంస్థకు చెందిన ఈ విశ్వవిద్యాలయంలో యోగ, ధ్యానము, మైండ్ మేనేజ్మెంట్, వేదాంత జ్ఞానం తో కూడిన విద్య అందుతుందని ఇంజనీరింగ్, మాస్టర్ డిగ్రీ పొందిన వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. స్వామి ముకుందానంద ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆధ్యాత్మిక గురువు, వైదిక పండితులు మరియు 'జగద్గురు కృపాలుజీ యోగ్' సంస్థ వ్యవస్థాపకులు. ప్రాచీన ఆధ్యాత్మిక జ్ఞానంతో ఆధునిక వైజ్ఞానిక తర్కాన్ని మేళవించగల తన సామర్థ్యానికి గాను ఆయన విస్తృతంగా గుర్తింపు పొందారని చెప్పారు. ఈ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. వచ్చే జూలై- ఆగష్టు నుండి కోర్సులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్, బెందాళం అశోక్ బాబు ను, కమీషనర్ నల్లి రమేష్ లను కలిసి కరపత్రాలను అందజేసి విద్యాలయ ప్రాముఖ్యతను వివరించారు. దీనిపై స్పందించిన విప్ విద్య,ఉపాధి రంగాలలో ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ విశ్వవిద్యాలయంలో చదివే విద్యార్థులకు బ్యాంకు స్టడీ లోన్ సౌకర్యం కూడా లభించునని తెలిపారు.

# మశాఖపురంలో ఘనంగా తాళ్లపాక అన్నమయ్య జయంతి

**ఇచ్ఛాపురం, మే 2 (వార్త):** మశాఖపురం గ్రామంలో రంగాల జగన్నాథం రెడ్డి జ్ఞాపకార్థం రంగాల జానకి రామ్ రెడ్డి తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవాలు మహతి సాంస్కృతిక కళాసేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మశాఖపురం గ్రామానికి చెందిన సీనియర్ సంగీత కళాకారుడు కొయ్య ఉమాపతి రెడ్డి దంపతులకు సంస్థ తరపున జ్ఞాపిక, సన్మాన పత్రం దుస్సాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి సుమారు 200 మంది కళాకారులు పాల్గొని, ఉదయం 8 గంటలకు తిరువీధి స్వామి వార్లు చిత్రపటాలతో గ్రామ మహిళలు పూర్ణ కలశాలు శ్రీ సంతోషిమాత జానపద కోలాట బృందం తోటూరు సైదాల్ పుట్టుగ వారి కోలాటం నృత్యం చూపరులను మంత్రముగ్ధుల్ని చేసింది. వెంకటేశ్వర స్వామి పై అపారమైన భక్తితో అన్నమయ్య రచించిన కీర్తనలు స్వామివారికి నీరాజనంగా, అన్నమయ్య సప్త కీర్తన గానం సామూహికంగా ఆలపించారు. పాల్గొన్న కళాకారులకు సన్మాన సత్కారాలు చేశారు. కార్యక్రమంలో శ్యాం ప్రసాద్ రెడ్డి, నర్తు నరేంద్ర యాదవ్, మాజీ ఎంపీపీ కారంగి మోహన్ రావు , ఎంపీపీ బోర పుష్ప, కంచిలి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి, కారంగి త్రినాథ్ రెడ్డి, మశాఖపురం పాండురంగ దేవాలయ అభివృద్ధి కమిటీ,గ్రామ పెద్దలు, మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ సభ్యులు కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం లోమహతి సంస్కృతిక కళాసేవ సంస్థ ప్రధాన సలహాదారులు తిప్పన దాలయ్య రెడ్డి, కరగానా ఏకంబరం, వ్యవస్థాపక కార్యదర్శి తిప్పన ధనుంజయ రెడ్డి, ప్రచార కార్యదర్శి చలపరాయి వినోద్ కుమార్ ఉపాధ్యక్షులు నర్తు గంగయ్య కోశాధికారి కొప్పల హేమంత్, ఉప కార్యదర్శి కారింగి తులసయ్య ఉప కోశాధికారి కారింగి త్రినాధ్, సలహాదారులు బోర రామారావు, దూట్ల వెంకటేశం, మార్పు నారాయణ రావు, ఇసరు జానకిరామ్ , బత్తుల కన్నారావు కళాకారులూ, కళాభిమానులు, కళాపోసకులు ఒడిశా, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, మందస, పలాస, నందిగాం టెక్కలి మండలాలుకి చెందిన కళాకారులూ పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546